క్లుప్తంగా

కాల్వలకు సాగునీరు విడుదల



ముండ్లపాడు(పెనుగంచిప్రోలు): మండలంలోని ముండ్లపాడు వద్ద సాగునీరు విడుదల చేయడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముండ్లపాడు వద్ద సాగర్ జలాలను శనగపాడు మేజర్–1,2 కాల్వలకు విడుదల చేశారు. దీంతో మిర్చి, సుబాబుల్ రైతులకు ఎంతో మేలు జరగనుంది. సాగర్ జలాల కోసం జగ్గయ్యపేట ఎమ్మెల్యే, విప్ సామినేని ఉదయభాను తెలంగాణ ఎన్నెస్పీ అధికారులతో పలు మార్లు సంప్రదింపులు జరిపి ఒక టీఎంసీ నీటిని విడుదల చేయించారు. దీంతో కాల్వ చివరి ఆయకట్టు వరకు నీరు విడుదలవుతోంది. కాల్వలను తహశీల్దార్ కె.లక్ష్మీకల్యాణి, డీసీ మాజీ ఉపాధ్యక్షుడు గుంటుపల్లి వాసు, రైతు నాయకులు గింజుపల్లి మధు పరిశీలించారు.

డ్వాక్రా మహిళలకు రూ.1.43 కోట్లు పంపిణీ



నందిగామ: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ లక్ష్యమని కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కొమ్మినేని రవిశంకర్ పేర్కొన్నారు. స్థానిక సొసైటీ కార్యాలయంలో మాగల్లు గ్రామానికి చెందిన తొమ్మిది డ్వాక్రా గ్రూపులకు మంజూరైన రూ.1.43కోట్ల రూపాయల రుణాలను సోమవారం ఆయన పంపిణీ చేశారు. ఈసందర్భంగా రవిశంకర్ మాట్లాడుతూ రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకొని ఆర్థిక స్వావలంబన సాధించాలని సూచించారు. కార్యక్రమంలో సహకార సంఘ కార్యదర్శి పూర్ణచంద్రరావు, సీసీ రమాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

పెండ్యాలకు రూ.45కోట్ల లబ్ధి



ఎంపీపీ షేక్ మలక్‌బషీర్

కంచికచర్ల : మండలంలోని పెండ్యాల గ్రామానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగున్నరేళ్ల పాలనలో అభివృద్ధి, సంక్షేమ పథకాల కింద రూ.45కోట్ల మేర లబ్ధి చేకూరిందని ఎంపీపీ షేక్ మలక్‌బషీర్ తెలిపారు. తన కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ తమ గ్రామమైన పెండ్యాలలో నిర్వహించిన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాలకు ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ హాజరై ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారన్నారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. అయితే గ్రామంలో తమ పార్టీలో రెండు వర్గాలు ఉన్నాయని, ఒక వర్గం తనపై దాడులు చేశారంటూ కొన్ని పత్రికలు విషపు రాతలు రాశాయని ఆక్షేపించారు. గ్రామంలోని ప్రతి నాయకుడు, కార్యకర్త పార్టీ బలోపేతం కోసం సైనికుల్లా పనిచేస్తున్నారని ఎంపీపీ మలక్‌బషీర్ వివరించారు.

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణవత్రం



పెద్దాపురం(వీరులపాడు): మండలంలోని పెద్దాపురంలో వేంచేసియున్న దాసాంజనేయస్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. టీటీడీ, హిందూధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 100 మంది దంపతులు పాల్గొని భక్తిశ్రద్ధలతో వ్రతాన్ని ఆచరించారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, మాజీ సర్పంచ్ ఆవుల మాధవి, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు కోటేరు శ్రీలక్ష్మి, ఉప సర్పంచ్ బవిరిశెట్టి లక్ష్మి, రెండు తెలుగురాష్ట్రాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని పూజలు చేశారు.

చికిత్స పొందుతున్న యువకుడు మృతి

కంచికచర్ల : ఓ యువకుడు మద్యంలో పురుగు మందు కలుపుకుని తాగి ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మృతి చెందిన సంఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ సుబ్రహ్మణ్యం కథనం మేరకు పరిటాల గ్రామానికి చెందిన తంగిరాల పాలలీస్(23) తాపీ పనిచేస్తుంటాడు. పాలలీస్ ఈనెల 18వ తేదీ రాత్రి సమయంలో బయటకు వెళ్లి మద్యంలో పురుగుమందు కలుపుకుని తాగాడు. గమనించిన స్థానికులు వెంటనే వైద్యం కోసం కంచికచర్లలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ అతను మృతిచెందినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వివరించారు.

శైవక్షేత్రాలకు పోటెత్తిన భక్తులు



ప్రత్యేకాలంకరణలో రామలింగేశ్వరుడు



నందిగామ శివాలయంలో తెల్లవారుజామునే కనిపిస్తున్న భక్తుల కోలాహలం



ముక్త్యాల కృష్ణానది ఒడ్డున కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

నందిగామ: కార్తిక మాస సోమవారం, పౌర్ణమి నేపథ్యంలో నందిగామ నియోజకవర్గ పరిధిలోని శైవ క్షేత్రాలకు భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము మూడు గంటలకే ఆలయాల్లో భక్తులు శివదర్శనం కోసం బారులు తీరారు. కార్తికదీపాలు వెలిగించి పరమశివున్ని భక్తి శ్రద్ధలతో కొలిచారు. నందిగామ పట్టణంలోని రామలింగేశ్వరస్వామి ఆలయం తెల్లవారు జాము నుంచే భక్తులతో కిక్కిరిసిపోయింది. వేలాది మంది భక్తులు తరలిరావడంతో స్వామి దర్శనానికి సుమారు రెండు గంటల సమయం పట్టింది. నందిగామ శివారు పల్లగిరి గుట్టపై ఉన్న భవాని శంకర స్వామి స్వయంభుశివలింగం, రైతుపేట డౌన్‌లోని విజ్ఞాన నందీశ్వర స్వామి ఆలయాల్లో అభిషేకాలు, దీపోత్సవాలు నిర్వహించారు. దాములూరు కూడలి సంగమేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు జరిగాయి. వైరా, కట్టలేరు సంగమ ప్రాంతంలో భక్తులు పుణ్యస్నానమాచరించి స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. గోళ్ళమూడి, రాఘవాపురం, మాగల్లు, పెద్దవరం గ్రామాల్లోని శివాలయాల్లో స్వామివారికి విశేష పూజలు చేశారు. సాయంసంధ్యా సమయంలో దీపోత్సవ కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

జగ్గయ్యపేట మండలంలో..

జగ్గయ్యపేట: కార్తీక సోమవారం, పౌర్ణమిని పురస్కరించుకుని మండలంలోని ముక్త్యాల, వేదాద్రి, కోటిలింగ హరిహర మహాక్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగాయి. తెల్లవారుజాము నుంచే తరలి వచ్చిన భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. కృష్ణానదిలో పవిత్ర స్నానాలాచరించి భవానీ ముక్తేశ్వరస్వామి వారి ఆలయంలో భక్తులు కార్తీక దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. కోటిలింగాలలోని పంచముఖ అమృతలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి అర్చకులు విశేష అభిషేకాలతోపాటు బాణవాయు శివలింగాలను ప్రతిష్ఠించారు. వేదాద్రిలోని యోగానంద లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆయా ఆలయాల ఈవోలు జయ ప్రకాష్‌బాబు, శిరీష ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

భక్తిశ్రద్ధలతో కార్తికమాస పూజలు..

పెనుగంచిప్రోలు: పవిత్ర కార్తికమాస సోమవారం సందర్భంగా గ్రామంలో వేంచేసియున్న శ్రీస్వయంభు శంభులింగేశ్వరస్వామి ఆలయం, శ్రీతిరుపతమ్మవారి ఆలయంతోపాటు మండలంలోని పలు ఆలయాలు భక్తులతో కళకళలాడాయి. ఆలయ అర్చకులు స్వామివారు, అమ్మవార్లకు ప్రత్యేకాలంకరణలు, పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మహిళలు కార్తిక దీపాలు వెలిగించారు. పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

వత్సవాయి మండలంలో..

వత్సవాయి : కార్తికమాస సోమవారం, పౌర్ణమి కలిసిరావడంతో భక్తులకు శివాలయాలకు పోటెత్తారు. వేకువజామునే ఆలయాలకు చేరుకున్న భక్తులు కార్తికపూజలు చేసి దీపాలు వెలిగించారు. వత్సవాయి, దబ్బాకుపల్లి, పోలంపల్లి, కంభంపాడు, లింగాల, చిట్టేల, మక్కపేట, భీమవరం, ఇందుగపల్లి, కన్నెవీడు, మంగొల్లు గ్రామాల్లోని శివాలయాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. అర్చకులు అత్తలూరి యుగంధర్‌శర్మ ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా దేవాదాయశాఖ ఆధ్వర్యంలో ఈవో సీహెచ్ హరిదుర్గానాగేశ్వరరావు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

కంచికచర్ల మండలంలో..


కంచికచర్ల : పరమ శివునికి ఎంతో ప్రీతికరమైన రోజు కార్తీక పౌర్ణమి. కార్తీక పౌర్ణమి సోమవారాన్ని పురస్కరించుకుని భక్తులు తెల్లవారుజామునే ఆలయాలకు చేరుకుని పూజలు చేశారు. 365 ఒత్తులతో దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. స్థానిక శివసాయి క్షేత్రం, అన్నపూర్ణా సహిత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అభిషేకాలు చేశారు. ఆయా గ్రామాల్లోని శివాలయాలన్నీ శివనామస్మరణతో మార్మోగాయి.



కోటిలింగాల క్షేత్రంలో అభిషేకాలు చేస్తున్న భక్తులు



శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు



విద్యుత్ దీపాలంకరణలో భవానీ ముక్తేశ్వరస్వామి ఆలయం



కంచికచర్ల పాతశివాలయంలో ప్రత్యేకాలంకరణలో స్వామివారు



నందిగామలో కార్తిక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

మహిళలకు ఉచిత కుట్టుశిక్షణ

నందిగామ: రాష్ట్ర ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ మహిళలకు ఉపాధి కల్పించాలని లక్ష్యంతో టైలరింగ్‌పై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు పట్టణంలోని ప్రభుత్వ మహిళా మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రమేష్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదోతరగతి చదివిన మహిళలకు ప్రత్యేకంగా రెండు నెలలపాటు టైలరింగ్ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. ఆసక్తిగల మహిళలు డిసెంబర్ నాలుగో తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు కళాశాలలో సంప్రదించాలని ఆయన సూచించారు.

నేటినుంచి 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాలు

జగ్గయ్యపేట: మండలంలో ఈనెల 28 నుంచి డిసెంబరు 13వతేదీ వరకు ఆయా గ్రామాల్లో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల సచివాలయ కన్వీనర్ సయ్యద్ షాబుద్దీన్ సోమవారం తెలిపారు. 28వ తేదీన అనుమంచిపల్లి, 29న చిల్లకల్లు–1, 30న చిల్లకల్లు–2, డిసెంబర్ ఒకటో తేదీన ధర్మవరప్పాడుతండా, 4న గండ్రాయి–1, 5న గండ్రాయి–2, 6వతేదీన గౌరవరం, 7న మల్కాపురం, 8న షేర్‌మహ్మద్‌పేట–1, 11వతేదీన షేర్‌మహ్మద్‌పేట–2, 12న తక్కెళ్లపాడు, 13వతేదీన కె.అగ్రహారం గ్రామాలోల ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. మండలంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన కోరారు.

నేడు గండేపల్లిలో 'వై ఏపీ నీడ్స్ జగన్'

కంచికచర్ల : మండలంలోని గండేపల్లిలో గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో పల్లెకు పోదాం కార్యక్రమంలో భాగంగా మంగళవారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సర్పంచి బొక్కా రవికుమార్ సోమవారం తెలిపారు. కార్యక్రమానికి నందిగామ ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహనరావు ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. గ్రామస్తులు, నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని సర్పంచి కోరారు.

స్పందన ద్వారా ఐదు అర్జీలు

నందిగామ: స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా సమస్యల పరిష్కారం కోరుతూ ఐదుగురు అర్జీలు అందజేసినట్లు ఆర్డీవో పి.సాయిబాబు తెలిపారు. రెవెన్యూశాఖకు సంబంధించి మూడు, పోలీసు, మున్సిపల్‌శాఖలకు సంబంధించి ఒక్కొక్క అర్జీ చొప్పున అందాయని వివరించారు. ఆయా అర్జీలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఆర్డీవో తెలిపారు.

నందిగామ సమగ్రాభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: నందిగామ పట్టణ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు తెలిపారు. పట్టణంలోని 20వవార్డులో రూ.8.30లక్షలతో చేపడుతున్న సిమెంట్‌రోడ్డు, డ్రైనేజీ పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ జగన్‌మోహనరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో నందిగామ పట్టణాన్ని అన్నిరకాలుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధిలో నందిగామ మున్సిపాలిటీ చివరిస్థానంలో ఉంటే ప్రస్తుతం మొదటి పదిస్థానాల్లో ఉందని గుర్తుచేశారు. ముఖ్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల వినియోగంలో నందిగామ మున్సిపాలిటీ అగ్రభాగాన ఉందని తెలిపారు. గత ప్రభుత్వాలకు భిన్నంగా నిరుపేద ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, మున్సిపల్ వైస్‌చైర్మన్ పాకాలపాటి కిరణ్, వార్డు కన్వీనర్ కరి రవీంద్ర, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాములపాటి రమేష్, షేక్ కరిముల్లా, చాపల మల్లికార్జునరావు, షేక్ జాఫర్, బాపట్ల సాంబయ్య, విశ్వనాథపల్లి కృపారావు, బండారు వెంకట్రావ్, బండారు శేషు, తానూరి రాము తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

పేటలో శరవేగంగా అభివృద్ధి పనులు

ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను తెలిపారు. పట్టణంలోని 31వవార్డులో రూ.75లక్షలతో నిర్మించనున్న కమ్యూనిటీహాల్, 150అడుగుల జాతీయజెండా స్థూపం పనులకు స్థలాల పరిశీలనతోపాటు నేషనల్ హైవే పక్కన రూ.35లక్షలతో నిర్మించనున్న మినీ పార్కు, నేషనల్ హైవేపై ఆటోనగర్ సమీపంలో రూ.కోటితో నిర్మిస్తున్న హైవే బస్టాండ్ నిర్మాణ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ పేట నియోజకవర్గంతోపాటు పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. రూ.2.5కోట్లతో టీటీడీ కల్యాణమండపం, రూ.1కోటితో జగ్గయ్యపేట–చిల్లకల్లు నాలుగు లేన్ల రోడ్డు డివైడర్‌పై సెంట్రల్ లైటింగ్, రూ.75లక్షలతో చేపట్టిన కమ్యూనిటీ హాలు పనులను శరవేగంగా పూర్తిచేస్తున్నట్లు చెప్పారు. హైవే బస్టాండ్ త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. ఈ బస్టాండ్ అందుబాటులోకి వస్తే పేట పట్టణం వ్యాపార, పారిశ్రామికంగా మరింత అభివృద్ధి చెందుతుందని వివరించారు. అభివృద్ధి పనులకు ప్రతిపక్షాలు ఆటంకాలు కల్పిస్తున్నా వెనకడుగు వేసే ప్రసక్తే లేదన్నారు. నియోజకవర్గ ప్రజల శ్రేయస్సే తన లక్ష్యం అని పేర్కొన్నారు. మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, కౌన్సిలర్ వెంకట్రామయ్య, నాయకులు తన్నీరు నాగేంద్ర, పూసల పుల్లారావు, సచివాలయ కన్వీనర్ గింజుపల్లి కృష్ణ, హరీష్ పాల్గొన్నారు.



జాతీయ జెండా స్థూపం నిర్మాణానికి స్థలాన్ని పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను

రూ.12లక్షలతో ఫౌంటెయిన్ ఏర్పాటుకు చర్యలు

జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రి అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను తెలిపారు. ఆస్పత్రి ఆవరణలో రూ.12లక్షలతో వాటర్ ఫౌంటెయిన్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే సామినేని ఉదయభాను మాట్లాడుతూ పెరిగిపోతున్న పట్టణ జనాభాను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వాస్పత్రిని రూ.3.5కోట్లతో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ఇటీవల ఆస్పత్రిలో రూ.26 లక్షలతో అంతర్గత సీసీ రోడ్లు, ప్రధాన గేట్లు, క్యాంటిన్ నిర్మాణ పనులను పూర్తి చేశామన్నారు. ఆస్పత్రి ఆవరణను మరింత అందంగా తీర్చిదిద్దేందుకు రూ.12లక్షలతో వాటర్ ఫౌంటెయిన్‌ను నిర్మిస్తున్నామని, త్వరలో పనులు ప్రారంభమవుతాయని ఆయన వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కఠారి హరిబాబు, నాయకులు తన్నీరు నాగేంద్ర, పూసల పుల్లారావు, గుంజ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి చేరికలు

వేములపల్లి(కంచికచర్ల): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో అర్హతే ప్రమాణికంగా పథకాలను అందిస్తుండటంతో ఇతరపార్టీల వారు వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ పేర్కొన్నారు. మండలంలోని వేములపల్లిలో ఆదివారం రాత్రి పది కుటుంబాలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరాయి. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్సీ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఎమ్మెల్సీ డాక్టర్ అరుణకుమార్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో 99శాతం అమలుచేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అవ్వాతాతలకు ఆసరా పింఛన్లు, రైతులకు పెట్టుబడి సాయంగా రైతుభరోసా, మహిళా సంక్షేమానికి తక్కువవడ్డీకే రుణాలు, విద్యార్థుల కోసం అమ్మఒడితోపాటు విద్యాదీవెన, వసతిదీవెన పథకాలను అమలుచేస్తున్నారన్నారు. సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ ద్వారా అర్హులందరికీ పథకాలు అందుతున్నాయన్నారు. రానున్న ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రతిఒక్కరూ పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచి ఉయ్యూరు అనుమాయమ్మ, ఎంపీటీసీ సభ్యుడు నల్లపు శ్రీనివాసరావు, సొసైటీ అధ్యక్షుడు కోదాటి రామకృష్ణ, నాయకులు ఉయ్యూరు నరసింహారెడ్డి, వెంకటరెడ్డి, పసుపులేటి వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, కోటేశ్వరరావు, వేల్పుల రమేష్ పాల్గొన్నారు.



వేములపల్లిలో వైఎస్సార్ సీపీలో చేరిన వారితో ఎమ్మెల్సీ మొండితోక అరుణకుమార్

టీడీపీ నాయకులపై చర్యలకు డిమాండ్

జగ్గయ్యపేట అర్బన్: ఓటర్ల జాబితాలో అవకతవకలు సరిదిద్దే పేరుతో ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని సేకరిస్తున్న తెలుగుదేశం పార్టీ నాయకులపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ వైస్‌చైర్మన్ తుమ్మల ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన తహశీల్దార్ సూర్యారావును సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ ఓటర్ల వెరిఫికేషన్ నిర్వహిస్తున్నామంటూ కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలకు విరుద్ధంగా ఇంటింటికీ వెళ్లి ఆయా కుటుంబసభ్యుల వివరాలను యాప్‌లో నమోదు చేస్తున్నారని ఆరోపించారు. ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని సేకరిస్తున్న తెలుగుదేశంపార్టీ కార్యకర్తలు, నాయకులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో వైఎస్సార్ సీపీ నాయకుడు పాటి సాంబ, ఆ పార్టీ కార్యాలయ సిబ్బంది నాగరాజు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న ప్రభాకర్, నాయకులు

విద్యుత్ ఏఈ బాలాజీ మృతి

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట పట్టణ విద్యుత్ శాఖ ఏఈ ధరావత్ బాలాజీ(52) ఆదివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. ఏఈ కుటుంబం గుంటుపల్లిలో ఉంటుండగా, స్థానిక వెంకటగిరిగుట్ట ప్రాంతంలో ఒక్కరే నివాసం ఉంటున్నారు. పనిమనిషి సోమవారం ఉదయం వెళ్లి చూడగా, తలుపులు వేసి ఉండటంతో తోటి ఉద్యోగులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి తలుపులు తీసి చూడగా ఏఈ బాలాజీ మృతి చెంది ఉన్నారు. ఆయన భార్య మృతి చెందగా, ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు.

నివాళులర్పించిన గోర్బాయ్ సేవాసంఘ సభ్యులు..

స్థానిక విద్యుత్‌శాఖ కార్యాలయంలో బాలాజీ చిత్రపటానికి గోర్బాయ్ సేవాసంఘం అధ్యక్షుడు లాహోరి బద్దూనాయక్, సభ్యులు నివాళులర్పించారు. ఆయన కుటుంబసభ్యులకు సానుభూతిని తెలియజేశారు.

పథకాలను సద్వినియోగం చేసుకోండి

గుమ్మడిదూర్రు(పెనుగంచిప్రోలు): మండలంలోని గుమ్మడిదూర్రు పంచాయతీ ఆవరణలో సోమవారం వికసిత భారత్ సంకల్ప్‌యాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ప్రతిజ్ఞ చేశారు. ఈసందర్భంగా డీపీవో జయచంద్ర మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు అందిస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయుష్మాన్ భారత్ పథకంలో భాగంగా మంజూరైన హెల్త్‌కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం అత్యుత్తమ సేవలందించిన గ్రామస్థాయి సిబ్బందిని ఘనంగా సత్కరించారు. సర్పంచ్ నక్కా కమల, ఎంపీపీ మార్కపూడి గాంధీ, జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి, ఎంపీడీవో శ్రీహర్షసాయి, ఏపీవో తిరుపతయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ హౌసింగ్ ఏఈలు నరసింహారావు, అప్పారావు, సొసైటీ అధ్యక్షులు వేమూరి శేషగిరిరావు, వైద్యాధికారి పి. ఇందిర, పీడీఎస్ డీటీ రామ్మూర్తిరెడ్డి, నాయకులు పొన్నం శివాజీ, ఎన్. ప్రవీణ్ పాల్గొన్నారు.

పరిటాలలో..

పరిటాల(కంచికచర్ల): మండలంలోని పరిటాల సచివాలయం–2లో సోమవారం నిర్వహించిన వికసిత భారత సంకల్పయాత్ర కార్యక్రమాన్ని సర్పంచి యద్దనపూడి ఆనందజ్యోత్స్న ప్రారంభించారు. ఈసందర్భంగా డీఎల్‌పీవో బొజ్జగాని శ్రీనివాసరావు మాట్లాడుతూ మహిళల కోసం ఉజ్వల పథకం, మెరుగైన వైద్యం అందించేందుకు ఆయుష్మాన్‌కార్డులు, పేదల కోసం జీవన్ జ్యోతి, సురక్షా బీమా, అటల్ పెన్షన్ యోజన తదితర పథకాలను కేంద్రం అమలు చేస్తుందని వివరించారు. ఎంపీడీవో కో.శిల్ప, బాలశంకరరావు, సీడీపీవో వీ భాగ్యరేణుక, వెలుగు ఏపీఎం కోట భాస్కరరావు, ఏవో కే విజయ్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయి శ్రీలక్ష్మి, పీహెచ్‌సీ డాక్టర్ కె.మధురిమ, హౌసింగ్ ఏఈ సాయిరాం, ఏపీవో రమాదేవి, నాయకులు యద్దనపూడి విజయారావు, మార్త శ్రీనివాసరావు, శేషయ్య, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

మాగల్లులో..

నందిగామ: మండలంలోని మాగల్లులో వికసిత భారత్ సంకల్పయాత్ర కార్యక్రమంలో భాగంగా కేంద్రప్రభుత్వం అమలుచేస్తున్న ఆయా పథకాలపై గ్రామస్తులకు సోమవారం ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీటీసీ సభ్యురాలు కామినేని శోభారాణి ముఖ్యఅతిథిగా హాజరై ఆయా పథకాలను వివరించారు. ఎంపీడీవో శ్రీనివాసరావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



గుమ్మడిదూరులో గ్రామస్థాయి సిబ్బందిని సత్కరిస్తున్న డీపీవో, ఎంపీపీ, జెడ్పీటీసీలు



పరిటాలలో సంకల్పయాత్రను ప్రారంభిస్తున్న డీఎల్‌పీవో శ్రీనివాస్, సర్పంచి ఆనందజ్యోత్స్న

నిత్యాన్నదానానికి రూ.1.50 లక్షల విరాళం

తిరుమలగిరి (జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసియున్న వాల్మీకోద్భవ వెంకటేశ్వరస్వామివారి నిత్యాన్నదానం పథకానికి మండలంలోని చిల్లకల్లు గ్రామానికి చెందిన కుమ్మరికుంట్ల చినపీతాంబరావు రూ.1,50,348 విరాళంగా అందజేసినట్లు ఏసీ దాసరి శ్రీరామవరప్రసాదరావు సోమవారం తెలిపారు. ఈసందర్భంగా చినపీతాంబరావును స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి, ప్రసాదాలు అందజేశారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

కంచికచర్ల : అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ పెంకె సత్య వెంకట సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. మండలంలోని కీసర మున్నేటిలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకుని, ఇసుకతో సహా ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ల డ్రైవర్లను అరెస్ట్ చేశామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. ఇసుక అక్రమరవాణాకు వినియోగించే వాహనాలను సీజ్‌చేస్తామని ఎస్ఐ హెచ్చరించారు.